# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 132 క్రిష్ణా, శుక్రవారం 06 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349



# బీజేపీ మరింత క్రియాశీలం కావాలి!

**కల్తీ లడ్డూ వ్యవహారం ఆ పార్టీ ద్వారానే మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుంది:**

**చంద్రబాబు సూచనతమ నేతలకు ఆదేశాలిస్తామన్న మాధవ్**

**కలిసికట్టుగా ఎదుర్కోవలసిందేనన్న పవన్**





**క్రైం కౌంటర్ న్యూస్,** అమరావతి, ఫిబ్రవరి 5: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో బీజేపీ కూడా మరింత క్రియాశీలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నట్లు తెలిసింది. ఇలాంటి అంశాలను బీజేపీ అయితేనే మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలదని పేర్కొన్నట్లు సమాచారం. ఉండవల్లి నివాసంలో గురువారం కూటమి నేతలతో ఆయన సుమారు గంటన్నరపాటు చర్చలు జరిపారు. సమావేశంలో తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. నెయ్యి కల్తీ జరిగిందని స్పష్టంగా తేలినా జగన్ అండ్ కో నిస్సిగ్గుగా ఏం జరగలేదంటూ బుకాయిస్తున్నారని, పైగా తనపైనే ఎదురుదాడి చేస్తున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇలాంటి వాటిని తేలిగ్గా తీసుకుంటే మున్ముందు మరింత బరితెగించి.. వారి తప్పులను మనపై నెట్టేస్తారని హెచ్చరించారు. హిందూధర్మం.. హిందూ మతవిశ్వాసాల విషయంలో ఇతర పార్టీలు ఎన్ని మాట్లాడినా.. బీజేపీ స్పందిస్తేనే అది ప్రజల్లోకి బలంగా వెళ్తుందన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో బీజేపీ నుంచి ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు పెద్దగా స్పందించడం లేదని చెప్పారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ స్పందించి.. తమ పార్టీ నేతలందరికీ స్పష్టమైన ఆదేశాలిస్తామని చెప్పినట్లు తెలిసింది. తిరుమల వ్యవహారం కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశమని, వేరే ఆలోచనకు తావులేకుండా తాము కూడా కూటమి పార్టీలతో కలిసి పోరాడతామని స్పష్టం చేసినట్లు సమాచారం. జనసేనాని పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను.. హిందూ దేవుళ్లను.. హిందూ మతాన్ని దెబ్బతీసి, నిర్వీర్యం చేసేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందని అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇలాంటి వాటిని కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవలసిందేనని ఆయన తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇటీవల నిర్వహించిన సర్వేల్లో వైసీపీకి పెద్దగా సానుకూలత లేదని తేలిందని.. ఆ పార్టీ గ్రాఫ్ మరింత దిగజారిందని, అందుకే జగన్ ప్రజల్లోకి వస్తూ ఇమేజ్ పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీకి చెందిన మంత్రులు వ్యాఖ్యానించినట్లు సమాచారం. లడ్డూ వ్యవహారంపై మూడు పార్టీల నుంచి త్రిసభ్య కమిటీ వేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై నేతల మధ్య చర్చ జరిగింది. దీనిపై మరోసారి కూర్చుని తుది నిర్ణయం తీసుకోవాలని నిశ్చయించారు.జంతు కొవ్వు దక్షిణ కొరియా నుంచి దిగుమతి! సమావేశంలో.. నెయ్యి కల్తీ ఎలా చేశారో మంత్రి పయ్యావుల కేశవ్ కూటమి నేతలందరికీ సవివరంగా తెలియజేశారు. అసలు పాలే లేకుండా కేవలం పామాయిల్, రసాయనాలతో నెయ్యి తయారు చేసి తిరుమలకు సరఫరా చేశారని.. ఆయా డెయిరీలు.. 58 లక్షల కేజీల పామాయిల్, సుమారు 2 లక్షల కేజీల వివిధ రకాల రసాయనాలు కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డు ఉందని ఆయన తెలిపినట్లు సమాచారం. జంతు కొవ్వు అయితే తక్కువ ధరకు వస్తుందనే ఉద్దేశంతో దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్నట్లు కూడా ఆధారాలు ఉన్నాయన్నట్లు తెలిసింది. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న ఖాతాలోకి వచ్చిన రూ.4 కోట్లు అంతిమంగా ఎవరికి చేరాయో తేలితే అసలు సూత్రధారుల గుట్టు రట్టు అవుతుందన్నారు. అలాగే నెయ్యి వ్యవహారంలో భారత ఆహార భద్రత–ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎ?సఎ?సఏఐ) అనుమతులు అవసరం లేదని బోర్డులో తీర్మానం చేయడం వెనుక ఎవరి ప్రోద్బలం ఉందో కూడా వెలుగు చూడాల్సి ఉందని చెప్పారు. ఇలాంటి ఎన్నో అంశాలపై మరింత దృష్టి సారిస్తే ఈ మొత్తం వ్యవహారంలో సూత్రధారులను ప్రజల ముందు నిలబెట్టవచ్చని కేశవ్ చెప్పినట్లు తెలిసింది.

# టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డి పశ్చాత్తాపం

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 05 :** గత వైసీపీ హయాంలో టీటీడీ కల్తీ నెయ్యి దందాకు దారులు వేసింది డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డేనని 'సిట్' నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఎక్కడో ఉత్తరాఖండ్‌లో ఉన్న భోలేబాబా డెయిరీ యజమాని పొమిల్ జైన్‌ను తిరుపతి సమీపంలోని వైష్ణవి డెయిరీకి తీసుకొచ్చింది, ఆ సంస్థతో కల్తీ నెయ్యి సరఫరాకు ఒప్పందం కుదిర్చింది కూడా విజయభాస్కరరెడ్డే. ఆ విషయం స్వయంగా ఆయనే సిట్ వద్ద అంగీకరించారు. 'తప్పు చేశాను' అంటూ పశ్చాత్తాపం ప్రకటించారు. తాను లంచంగా తీసుకున్న సొమ్ములో మిగిలిన రూ.34 లక్షల నగదును, గోల్డ్ కాయిన్‌ను సిట్‌కు స్వచ్ఛందంగా అప్పగించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారేందుకు కూడా సిద్ధపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డి ఏపీలో ప్రాచుర్యం కలిగిన దొడ్ల డెయిరీకి తొలుత కన్సల్టెంట్‌గా పనిచేశారు. ఎలాగో టీటీడీకి చేరువై 2013 నుంచి 2027 వరకు నెయ్యి కొనుగోలు వ్యవహారాల్లో కీలక పాత్ర వహిస్తూ వచ్చారు. ఏమైందో ఏమో గానీ ఆ తర్వాత టీటీడీ ఆయనను దూరం పెట్టింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే, తిరిగి టీటీడీ నెయ్యి కొనుగోలు వ్యవహారాల్లో విజయభాస్కర్‌రెడ్డి తెర ముందుకు వచ్చారు.

**పునబాకకు పొమిల్‌జైన్..**

2019 ఆగస్టులో ట్యాంకర్ల ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేసే టెండర్లలో ఉత్తరాఖండ్ రాష్ట్రం భగవాన్‌పూర్‌లోని భోలేబాబా డెయిరీ పాల్గొంది. ఆ క్రమంలో డెయిరీ ప్లాంట్‌ను తనిఖీ చేసేందుకు డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డి ఉత్తరాఖండ్ వెళ్లారు. అక్కడ తనిఖీలో భోలేబాబా డెయిరీకి పాల సేకరణ సామర్థ్యం గానీ, నెయ్యి సరఫరా సామర్థ్యం గానీ లేవని తిరస్కరించారు. అదే సమయంలో భోలేబాబా డెయిరీ యజమాని పొమిల్‌జైన్‌తో విజయభాస్కర్‌రెడ్డి కుమ్మక్కై కీలక సలహా ఇచ్చారు. ఏపీలోని డెయిరీలను ప్రోత్సహించడానికి టీటీడీ 2018 నుంచీ ఏపీ కేటగిరీ కింద ప్రత్యేకంగా టెండర్లు పిలుస్తోందని, ఆ కేటగిరీ కింద టెండర్లలో పాల్గొంటే నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కించుకోవచ్చునని సూచించారు. ఏపీలో తనకు వైష్ణవి అనే డెయిరీ తెలుసుని, దానితో ఒప్పందం కుదిరిస్తానని చెప్పారు. ఆ డెయిరీని టేకప్ చేసి దాని ద్వారా టెండర్లు వేసి టీటీడీ నెయ్యి కాంట్రాక్టు సొంతం చేసుకోవాలని పొమిల్ జైన్‌కు సూచించారు. 2019 అక్టోబరులో పొమిల్ జైన్‌ను వెంటబెట్టుకుని తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పునబాక గ్రామం వద్ద ఉన్న వైష్ణవీ డెయిరీకి ఆయనే తీసుకెళ్లారు.

**రూ. 7 కోట్ల అప్పులు... జీతాలివ్వలేని వైష్ణవి**

పునబాకలో వైష్ణవి డెయిరీ 2011లో ఏర్పాటైంది. దానికి నలుగురు యజమానులు. 2016 వరకూ ఆ డెయిరీ బాగానే నడిచింది. తర్వాత ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోయింది. 2019 అక్టోబరులో విజయభాస్కర్‌రెడ్డి భోలేబాబా యజమాని పొమిల్‌జైన్‌ను అక్కడికి



తీసుకెళ్లేనాటికి వైష్ణవి డెయిరీ రూ.7 కోట్ల అప్పుల్లో ఉంది. సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉంది. నలుగురు యజమానుల్లో ముగ్గురు డెయిరీని నడపడం తమ వల్ల కాదంటూ నాలుగో వ్యక్తి రాజేశ్ చావడాకు అప్పగించి వెళ్లిపోయారు. రాజేష్‌ను పొమిల్‌జైన్‌కు విజయభాస్కర్‌రెడ్డి పరిచయం చేశారు. వైష్ణవి డెయిరీ నిర్వహణను పొమిల్ జైన్ చేపడతారని, కేవలం డాక్యుమెంట్లు ఇస్తే చాలు...వైష్ణవి పేరిట టీటీడీ టెండర్లలో పాల్గొంటారని చెప్పారు. నెయ్యి తయారీ, సరఫరా, టీటీడీని మేనేజ్ చేయడం వంటివన్నీ పొమిల్ జైనే చూసుకుంటారని చెప్పారు. నిజానికి వైష్ణవి డెయిరీకి కూడా టీటీడీ టెండర్లలో పాల్గొనే అర్హత లేదు. డెయిరీ డాక్యుమెంట్లు తీసుకున్న పొమిల్ జైన్ వాటి ఆధారంగా ఎక్కువ సామర్థ్యం చూపుతూ నకిలీ పత్రాలు సృష్టించి టెండర్లలో పాల్గొన్నారు. పొమిల్ జైన్ 2020 జనవరి నుంచి 2024 వరకూ నిరంతరంగా టీటీడీకి 'నెయ్యి' సరఫరా చేశారు. భోలేబాబా డెయిరీ నుంచి కల్తీ నెయ్యిని 32 వేల కిలోల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లలో వైష్ణవి డెయిరీకి తరలించారు. ఈ విధంగా విజయభాస్కర్‌రెడ్డి సహకారంతో వైష్ణవి డెయిరీ ద్వారా టీటీడీకి ఏకంగా రూ. 130 కోట్ల విలువైన 33 లక్షల కిలోల కల్తీ నెయ్యిని పొమిల్ జైన్ సరఫరా చేయగలిగారు. సిట్ ఈడెయిరీని తనిఖీ చేసే నాటికి వైష్ణవీ డెయిరీలో కనీసం వెయింగ్ మెషిన్ కూడా లేకపోదు. కాగా, వైష్ణవి డెయిరీ యాజమాన్యాన్ని పరిచయం చేసి ఒప్పందం కుదిర్చిన తీరులోనే పుణెలోని మాల్‌గంగా డెయిరీ యాజమాన్యాన్ని కూడా విజయభాస్కర్‌రెడ్డే పొమిల్ జైన్‌కు పరిచయం చేశాడు. 2022లో దీని కోసమే ఆయన టీటీడీకి దక్షిణ భారత దేశంలోని డెయిరీల నుంచీ నెయ్యి కొనుగోలు చేయాలని సలహా ఇచ్చారు. ఈ మేరకు టీటీడీ 1500 కిలోమీటర్ల పరిధిలోని డెయిరీల నుంచీ టెండర్లు పిలిచింది. ఆ క్రమంలోనే పొమిల్ జైన్‌కు పుణేలోని మాల్‌గంగా డెయిరీ యాజమాన్యంతో ఒప్పందం కుదిర్చారు.

# కార్మిక సంక్షేమ పథకాల పునరుద్ధరణ

**ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణకు చర్యలు**

**తద్వారా ఆదాయాలు గణనీయంగా పెరగాలి**

**అసంఘటిత రంగ కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రోత్సహించాలి**

**కార్మిక శాఖపై సమీక్షలో సీఎం ఆదేశాలు**




**క్రైం కౌంటర్ న్యూస్,** అమరావతి, ఫిబ్రవరి 5: అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. కార్మిక శాఖపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలు, జీవన ప్రమాణాలను పెంచే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టి, ఎన్‌సీసీ, మిట్టల్ సహా వివిధ సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా రాష్ట్రంలోని కార్మికులు దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొంది, అధిక ఆదాయం ఆర్జించేలా చూడాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటాబ్య?సను అనుసంధానించడంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికుల ఆదాయాలు పెరిగేలా చూడాలన్నారు. ఆధునిక పనిముట్లను కార్మికులకు అందించాలన్నారు. నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న భారీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా మన యువతకు అవసరమన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించాలని, యూనివర్సల్ హెల్త్ పాలసీతోపాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు, ఆపై ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలని స్పష్టం చేశారు.

**నేడు కర్నూలు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన**

**రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ**

ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం కర్నూలు జిల్లాలో పర్యటిస్తారు. ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. అనంతరం ఉదయం 11:30 సమయంలో గ్రామసభలో, రైతులతో ముఖాముఖి, టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. రైతులు సాగు చేసిన సజ్జ, బెండ పంటలను పరిశీలిస్తారు. అక్కడే రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు. ఆ తరువాత కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం 4:20 గంటలకు తిరుగుప్రయాణం అవుతారు.

# పుట్టినరోజు వేడుకల్లో విషాదం.. ఇద్దరు గల్లంతు



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 05 :** బాపట్ల జిల్లాలో పుట్టినరోజు వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. చినగంజాం మండలం పల్లిపాలెం బీచ్లో విషాదం చోటు చేసుకుంది. పుట్టిన రోజు వేడుల్లో భాగంగా నలుగురు విద్యార్థులు బీచ్‌కు వెళ్లారు. సరదాగా సముద్రంలో స్నానం చేసేందుకు ప్రయత్నం చేశారు. అయితే ఒక్కసారిగా సముద్ర కెరటాలు విరుచుకుపడటంతో నలుగురు విద్యార్థులు శ్రీరామ్, అవినాశ్, హేమసాయి , హేమ వర్ధన్ గల్లంతయ్యారు. అయితే వీరిలో ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. శ్రీరామ్, అవినాశ్ మాత్రం సముద్రపు నీటిలో కొట్టుకుపోయారు. పుట్టిన రోజునే శ్రీరామ్ ప్రమాదంలో చిక్కుకోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న మెరైన్ పోలీసులు, ఈతగాళ్ల సాయంతో శ్రీరామ్, అవినాశ్ కోసం గాలిస్తున్నారు. విద్యార్థులందరూ ఇంకొల్లు మండలం దద్దుకూరులో జడ్పీ స్కూల్లో పదో తరగతి చదువుతున్నట్లు గుర్తించారు.

# వివేకా హత్య కేసు దర్యాప్తు..నెల గడువుతో విచారణపై ప్రభావం

**సీబీఐ వీలైనంత త్వరగా పూర్తిచేయాలి**
**సునీతారెడ్డి అభ్యర్థనలు స్వీకరించాలి: సుప్రీం**
**ఎవరిని విచారించాలో సీబీఐకి పూర్తి స్వేచ్ఛ**



క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నెలరోజులంటూ గడువుపెడితే దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశముందని అభిప్రాయపడింది. అందుకే.. ట్రయల్ కోర్టు ఆదేశాల ప్రకారం నెల రోజుల్లో కాక.. వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తిచేయాలని సీబీఐని ఆదేశించింది. నిందితులు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డి, యాదాటి సునీల్ యాదవ్, టి.గంగిరెడ్డిలకు కింది కోర్టులు ఇచ్చిన బెయిళ్లను రద్దు చేయాలని వివేకా కుమార్తె సునీతారెడ్డి, సీబీఐ దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు గురువారం న్యాయస్థానం ముందుకొచ్చాయి. కేసులో అన్ని కుట్రకోణాలను వెలికితీసేంత వరకూ సీబీఐ దర్యాప్తు జరిపేలా ఆదేశించాలని సునీత కోరగా.. హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు నిరాకరించింది. కేవలం ఇద్దరి పాత్రను వెలికితీసేంత వరకే దర్యాప్తు జరపాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన పిటిషన్ సైతం విచారణకు వచ్చింది. అన్ని పిటిషన్లను కలిపి జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. సునీత తరఫు సీనియర్‌న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. సీబీఐ దర్యాప్తు పరిధిని ప్రత్యేక కోర్టు కుదించడం సరికాదన్నారు. కేవలం నిర్దిష్ట అంశంపైనే దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించడం వల్ల వాస్తవాలు వెలుగులోకి రాకుండా దర్యాప్తు ముగిసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ కోర్టు ఆదేశాలతో కేసులోని ఇతర కుట్ర కోణాలు, కీలక కుట్రదారులు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోతుందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందుకే సీబీఐ కోర్టు ఆదేశాలను సవాల్ చేశామని తెలిపారు. కాగా.. సీబీఐ తరఫు న్యాయవాది కలుగజేసుకుని.. ఇప్పటికే ప్రధాన దర్యాప్తు ముగిసిందని, ట్రయల్ కోర్టు ఆదేశాల మేరకు అదనపు విచారణ నిర్వహిస్తున్నామన్నారు. తుదిదశలో ఉన్న క్రమంలో మళ్లీ అభ్యంతరాలు లేవనెత్తితే కేసును మరింత సమయం సాగదీయడమే అవుతుందని తెలిపారు.దర్యాప్తు పేరుతో సాగదీసే కుట్ర: నిందితులు దర్యాప్తు పేరుతో కేసును సాగదీసే కుట్ర జరుగుతోందని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. తమ క్లయింట్లకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, అన్ని కోణాలను పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తేల్చిచెప్పింది. ప్రతి పిటిషన్‌పై మినీ ట్రయల్ నిర్వహించలేమని స్పష్టం చేసింది. ఇలాంటి విజ్ఞప్తులను అనుమతిస్తూ పోతే ఈ కేసుకు అంతుండదని తెలిపింది. ఇలాగే పిటిషన్లపై విచారిస్తుంటే దర్యాప్తు ముగియడానికి మరో నాలుగేళ్లు పట్టే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది.

అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తేనే వాస్తవాలు వెలుగులోకి: ధర్మాసనం

సునీత తరఫున రెండు కీలక అభ్యర్థనలు ఉన్నాయని.. వాటిని స్వీకరించేలా సీబీఐని ఆదేశించాలని లూథ్రా ?విజ్ఞప్తి చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఆమె అభ్యర్థనలు స్వీకరించాలని సీబీఐని ఆదేశించింది. అలాగే ట్రయల్ కోర్టు ఇచ్చిన నెలరోజుల గడువుతో కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని.. కొత్త నిజాలు తెలిసినప్పుడు గడువు ముగిసిందనే కారణంతో నిరాకరించలేం కదా అని ప్రశ్నించింది. సీబీఐకి ఉన్న స్వేచ్ఛను దెబ్బతీయలేమని, దానికి ఎవరినైనా విచారించే స్వేచ్ఛ ఉంటుందని జస్టిస్ సుందరేశ్ గుర్తుచేశారు. దర్యాప్తుపై నిర్ణీత గడువు విధించడాన్ని లూథ్రా మరోసారి ప్రస్తావిస్తుండగా.. ముందు దర్యాప్తు జరగనివ్వాలని.. ఆ తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దామని న్యాయమూర్తి తెలిపారు. ట్రయల్ కోర్టు ఆదేశాల మేరకే సీబీఐ తన దర్యాప్తును కొనసాగించవచ్చుని.. ఎవరిని విచారించాలి.. ఎవరిని అదుపులోకి తీసుకోవాలపై కలుగజేసుకోలేమని, ధర్మాసనం తేల్చిచెప్పింది. అది పూర్తిగా సీబీఐ విచక్షణకు సంబంధించిన అంశమని స్పష్టతనిచ్చింది. ట్రయల్ కోర్టు పర్యవేక్షణలో విచారణ వేగంగా జరగడమే ముఖ్యమని.. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడింది. వీలైనంతత్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని ఆదేశించింది. దర్యాప్తులో పురోగతిని బట్టి.. సునీత అభ్యర్థనలు, నిందితులు సమర్పించే అదనపు మెటీరియల్‌ను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది.

# జంతువుల కొవ్వూ కలిసింది! 'నెయ్యి' నమూనాలో ఎస్-వాల్యూ 117

**ఇది పంది కొవ్వు కలిసిందనే సంకేతం**
**స్వచ్ఛమైన ఆవునెయ్యి ఎస్-వాల్యూ 104 దాటొద్దు**
**అన్ని ప్రమాణాల్లో అంతకుమించే**
**కొవ్వులతో కల్తీ చేశారనేందుకు అదే నిదర్శనం**
**కూటమి వచ్చిన కొత్తలోనే ఎన్‌డీడీబీలో పరీక్ష**
**నెయ్యి కల్తీని 2022లోనే నిర్ధారించిన సీఎ?ఫటీఆర్ఐ**
**కళ్లుమూసుకున్న నాటి పాలక మండలి, అధికారులు**
**అడ్డంగా దొరికిపోయినా బుకాయింపు మానని వైవీ**
**తప్పు చేసిన వాళ్లు లెంపలేసుకోవాలి!.. పాపం చేసిన వాళు కనీసం పశ్చాత్తాపం ప్రకటించాలి!**
**కానీ... వైసీపీ నేతల తీరే వేరు! కించిత్ పశ్చాత్తాపం లేకపోగా... ఎదురుదాడి, బుకాయింపులే వారి దారి!**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 05 : వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ పాలకమండలి మాజీ అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి అడ్డంగా దొరికిపోయారు. మొన్నటిదాకా 'కల్తీ' మాటెత్తని ఆయన... 'కల్తీ జరిగితే జరిగి ఉండొచ్చు' అని సన్నాయి నొక్కులు నొక్కారు. జంతువుల కొవ్వు కలవలేదంటున్న ఆయన.. పంది కొవ్వు కలిసిందని ఏకంగా జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ధ్రువీకరించిందని చెప్పగా... 'అది అనుమానం మాత్రమే' అని వెల్లడించారు. అసలు నిజం ఏమిటంటే... జగన్ హయాంలో తిరుమలకు సరఫరా అయ్యింది నెయ్యే కాదు! పామోలిన్ నూనెలో రకరకాల రసాయనాలు కలిపి పంపారు. మరో దారుణమైన సత్యం ఏమిటంటే... 'నెయ్యే కాని ఆ నెయ్యి'లో జంతువుల కొవ్వులూ కలిశాయి. ఇది... అక్షరాలా నిజం. పాడిపరిశ్రమకు సంబంధించిన అత్యున్నత నియంత్రణ సంస్థ 'ఎన్‌డీడీబీ-కాఫ్' ప్రయోగశాలలోనే ఇది రుజువైంది. అందులో... పంది కొవ్వూ (ల్యార్డ్) కలిసిందని తేలింది. అయినా సరే... 'అది అనుమానం' మాత్రమే అని వైవీ సుబ్బారెడ్డి దబాయించడం గమనార్హం. ప్రపంచంలో ఏ ప్రయోగ శాల అయినా... తన పరీక్షల ఫలితాలను 'ఇదే ఫైనల్' అని చెప్పదు. చివరికి... మనం రక్తపరీక్ష చేయించుకున్నప్పటికీ 'కో రిలేట్' చేసుకోవాలని రిపోర్ట్‌లో ఉంటుంది. నెయ్యికి సంబంధించి ఎన్‌డీడీబీ నివేదికలో 'సస్పెక్టెడ్' అనే పదానికి అర్థం కూడా అదే!

ఎన్‌డీడీబీ చెప్పిందిదే... 'స్వచ్ఛమైన ఆవు నెయ్యి' అంటూ జగన్ హయాంలో ట్యాంకర్ల కొద్దీ కల్తీ నెయ్యిని టీటీడీకి సరఫరా చేశారు. అప్పటికే వచ్చిన ఫిర్యాదులు, బలమైన అనుమానాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీ అధికారులు 'నెయ్యి' శాంపిళ్లను ఎన్‌డీడీబీ ప్రయోగశాలకు పంపించారు. అందులో నివ్వెరపోయే వాస్తవాలు బయటపడ్డాయి. అందులో... బీటా సిటోస్టిరాల్, లారిక్‌యాసిడ్, లిగ్నోసెరిక్ యాసిడ్ వంటివి పరిమితికి మించి ఉన్నాయని తేల్చింది. చివరికి, జంతువుల కొవ్వు, పంది కొవ్వూ (ల్యార్డ్) ఉందని నిర్ధారించింది. ఆవు నెయ్యి స్వచ్ఛతను 'ఎస్-వాల్యూ' ఆధారంగా గుర్తిస్తారు. ఒక ప్రమాణం ప్రకారం... ఎస్-వాల్యూ 97.96 నుంచి 102.04 మధ్య ఉండాలి. కానీ... ఏకంగా 117.15 ఉన్నట్లు తేలింది. పంది కొవ్వు (ల్యార్డ్) కలిపితేనే ఇంత ఎస్-వాల్యూ వస్తుంది.

ఎప్పుడో కల్తీ తేలినా... వైవీ సుబ్బారెడ్డి టీటీడీ అధ్యక్షుడిగా ఉండగానే... కల్తీ బండారం బయటపడింది. టీటీడీకి సరఫరా చేసిన 3 ట్యాంకర్లు, ఒక టిన్ నెయ్యిని 2022 జూన్ 8న పరీక్షించగా... అందులోనూ కల్తీ జరిగిందని కేంద్ర ఆహార-సాంకేతిక పరిశోధనా సంస్థ (సీఎ?ఫటీఆర్ఐ) నిర్ధారించింది. 2022 ఆగస్టు 3న టీటీడీకి నివేదించింది. మరి... కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రశ్నిస్తే, 'నాకేం తెలియదు. అంతా అధికారులే చూసుకోవాలి" అని వైవీ సుబ్బారెడ్డి చెబుతున్నారు. 'నెయ్యి కల్తీ జరిగింది' అని కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థ చెప్పినా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యం కాదా? చైర్మన్ హోదాలో ఆయన ఏం చేసినట్లు? కల్తీని నిర్ధారించే 2 నివేదికలు కళ్లముందున్నా వైవీ కప్పదాట్లు ప్రదర్శిస్తున్నారు.

ఎన్‌డీఆర్ఐ... ఎందుకిలా?

సీఎ?ఫటీఆర్ఐతోపాటు ఎన్‌డీడీబీ ప్రయోగశాలల్లో కల్తీ నిర్ధారణ అయినప్పటికీ... 'సిట్' మరోసారి శాంపిళ్లను హరియాణాలోని ఎన్‌డీఆర్ఐకి పంపింది. ఆ సంస్థ...అటూ ఇటూ తేల్చని ఒక అసహాయ నివేదికను ఇచ్చింది. అసలు విషయం ఏమిటంటే...టీటీడీకి నెయ్యి కొనుగోలు టెండర్ నిబంధనలు సడలించిన సమయంలో...ఆ తర్వాత బోలేబాబా, దాని అనుబంధ డెయిరీల తనిఖీకి నియమించిన బృందంలో ఎన్‌డీఆర్ఐకి చెందిన ఇద్దరు అధికారులూ సభ్యులుగా ఉన్నారు. 'అంతా ఓకే' అంటూ గేట్లు ఎత్తేశారు. ఇప్పుడు అదే ఎన్‌డీఆర్ఐ... నిక్కచ్చిగా నివేదిక ఇస్తుందని ఎలా ఆశించగలం!?

# ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఆర్థిక ఇబ్బందులున్నా 1నే జీతాలు ఇస్తున్నాంఉద్యోగుల బకాయిలు చెల్లిస్తాం**
**ఈహెచ్ఎ?సను అప్‌డేట్ చేస్తున్నాం**
**ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహాసభలో మంత్రులు కేశవ్, సత్యకుమార్**
**పీఆర్సీ కమిషనర్‌ను నియమించండి: ఏపీ జేఏసీ అమరావతి**



క్రైం కౌంటర్ న్యూస్, విజయవాడ సిటీ, ఫిబ్రవరి 5 రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సేవా సంఘాల ఐక్యకార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ అమరావతి) 4వ రాష్ట్ర మహాసభ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగింది. తొలుత జేఏసీ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ ఆధ్వర్యంలోవేలాది మంది ఉద్యోగులు లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు మంత్రులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఉద్యోగులు కష్టపడి దాచుకున్న డబ్బును గత వైసీపీ ప్రభుత్వం మింగేసిందని ఆర్థిక మంత్రి కేశవ్ అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు నిరంతరం చర్చలు జరుగుతున్నాయన్నారు. కాస్త ఆలస్యమైనా.. ఉద్యోగుల సంక్షేమం కోసం చేయగలినంత చేస్తామని భరోసా ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సానుకూలతతో ఉందన్నారు. స్త్రీ పథకం ద్వారా వైద్య ఆరోగ్య శాఖకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈహెచ్ఎ?సను అప్‌డేట్ చేసి ఉద్యోగులకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 18 నెలల్లో జరిగే క్లయిమ్‌లను మూడు నెలలకు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

బకాయిలన్నీ క్లియర్ చేయండి

సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు పలు డిమాండ్లను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించి వెంటనే ఐఆర్ ప్రకటించాలని, డీఏ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, దీనిలో తొలి ప్రాధాన్యత పెన్షనర్లకు ఇవ్వాలని, 11వ పీఆర్సీ ఎరియర్స్‌ను ఆలస్యం లేకుండా విడుదల చేయాలన్నారు. జీపీఎఫ్ మొత్తాల నుంచి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, సరెండర్ లీవ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. జేఏసీ తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

# ఎక్కడికెళ్లినా అదే రచ్చ

**పరామర్శ అయినా, పెళ్లి వేడుకైనా ఒకేలా జగన్ అభిమానుల హంగామా**
**మండలి చైర్మన్ మోషేన్ రాజు కుమారుడి వివాహానికి మాజీ సీఎం**
**పెళ్లి వేడుకలోనూ సీఎం జగన్ అంటూ నినాదాలు**



పరామర్శ అయినా, పెళ్లి వేడుక అయినా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అభిమానులు, ఆ పార్టీ కార్యకర్తలు ఒకేలా వ్యవహరిస్తున్నారు. ఆయన ఎక్కడికెళ్లినా రచ్చ రచ్చ చేస్తున్నారు. గురువారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పెద అమిరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కుమారుడి వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్ ఉదయం 11.15 సమయంలో హాజరయ్యారు. ఇది తెలిసి ఆయన అభిమానులు అక్కడ గుమిగూడారు. జగన్ కళ్యాణ వేదిక వద్దకు వెళ్లిన సమయంలో వారిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన స్టీల్ బారికేడ్లను నెట్టేసి కల్యాణ మండపంలోకి దూసుకెళ్లారు. పులివెందుల పులి, సీఎం జగన్ అంటూ కల్యాణం మండపంలో జగన్ ఉన్నంత సేపూ పెద్దపెట్టున నినదిస్తూనే ఉన్నారు. హెలీప్యాడ్ వద్ద కార్యకర్తల హడావుడి లేకపోయినా, కల్యాణ వేడుక ప్రాంగణంలో మాత్రం కార్యకర్తలు హంగామా చేశారు.

# భగవంతుడిపైనే పగబట్టారు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 05 : వైసీపీ వాళ్లకు హిందూ ధర్మంపై గౌరవం లేదని.. వారు భగవంతుడి మీద పగబట్టారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. శ్రీవారికి ఏడు కొండలు ఎందుకు.. రెండు కొండలు మాత్రమే చాలంటారు. తిరుమల లడ్డూని కల్తీ చేసి, సీబీఐ తమకు క్లీన్ చిట్ ఇచ్చిందని ప్రచారం చేసుకుంటారు. భగవంతుడిపై పగబట్టిన వాడు సర్వనాశనమైపోతాడు తప్ప బతికిన దాఖలాల్లేవు. దేవుడు, మతం అనేవి సున్నితమైన అంశాలు. వీటి విషయంలో జనసేన ముందు నుంచీ ఆచితూచి మాట్లాడుతోంది. కల్తీ నెయ్యి ఘాతుకానికి పాల్పడిన వారి అసలు ఉద్దేశం తెలియాలంటే ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏం జరిగిందో తెలుసుకోవాలి. వారి హయాంలో హిందూ ఆలయాలపై ఎన్నో దాడులు జరిగాయని, రామతీర్థంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేశారని, అంతర్వేదిలో రథం కాలిపోతే పిచ్చోడి పని అన్నారరు. దుర్గమ్మ ఉత్సవ రథానికి ఉన్న వెండి సింహాన్ని చోరీ చేస్తే పోతే పోయిందని వ్యాఖ్యానించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సంఘటనలు 219 వరకు జరిగాయి' అని తెలిపారు. తిరుమల లడ్డూ కల్తీ అనేది హిందూ విశ్వాసాలపై దెబ్బకొట్టే ప్రయత్నమని అన్నారు. 'అయోధ్య రామాలయ నిర్మాణం కోసం దేశమంతా ఎంతో కాలం ఎదురుచూసింది. అలాంటి అయోధ్యకు కూడా సుమారు లక్ష కల్తీనెయ్యితో తయారైన తిరుమల లడ్డూలని పంపారరంటే వీరు హిందూమతంపై ఏ స్థాయిలో కుట్ర చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు' అని చెప్పారు.

రాజకీయ లబ్ధి మా లక్ష్యం కాదు..

తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో జంతు కొవ్వు, పందికొవ్వు, గొడ్డు కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ రిపోర్టులో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయం మాకు తెలిసిన తర్వాత చెప్పకపోతే నేరం అవుతుంది. అందుకే సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని చెప్పారు. దీని వల్ల మేమెలాంటి రాజకీయ లబ్ధీ పొందాల్సిన అవసరం లేదు. ఎన్నికలకు ముందు ఇలాంటి విషయాలు చెబితే రాజకీయ లబ్ధి కోసం అనుకోవచ్చు. అధికారంలోకి వచ్చిన రెండో నెలలోనే ఆ రిపోర్టులో ఏముందో చెప్పకపోతే నేరం అవుతుంది. తిరుమలకు సరఫరా చేసేందుకు ఆయా డమ్మీ డెయిరీలు.. సుమారు 58 లక్షల కేజీల పామాయిల్ కొన్నాయి. మరో 2 లక్షల కేజీల వరకు కెమికల్స్ కొన్నాయి. ఆన్ రికార్డుగా దొరికారు. సీబీఐ ఎక్కడా వీరికి క్లీన్ చిట్ ఇవ్వలేదు. ఈ కల్తీ వ్యవహారంలో ఇతర మతాలకు ఎలాంటి సంబంధం లేదు. వైసీపీ వాళ్లు చేసిన తప్పునకు క్షమాపణ కోరకుండా.. పైగా మమ్మల్ని క్షమాపణ కోరడం విడ్డూరంగా ఉంది. 2022లోనే కల్తీ జరిగిందని నివేదిక వస్తే దాన్ని తొక్కి పెట్టారు. తెలియక చేస్తే పొరపాటు అవుతుంది. తెలిసి చేస్తే నేరమవుతుంది. 2019లో నెయ్యి ధర బహిరంగ మార్కెట్‌లో కిలో కనీసం రూ.420గా ఉండేది. రూ.319కే సరఫరా చేస్తామంటే అప్పటి పాలకులు గుడ్డిగా ఎలా అంగీకరించారు? ఓ సాధారణ గృహిణి కూడా అది కల్తీ నెయ్యి అని చెప్పగలదు. వివేకానందరెడ్డిని హత్య చేసి గుండెపోటు అంటారు. నెయ్యిలో కల్తీ లేదు.. సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందంటారు. అన్నీ తెలిసి అయోధ్యకు కల్తీ లడ్డూలు పంపారు. హిందూ విశ్వాసాలపై దెబ్బ కొట్టే ప్రయత్నం ఇది. దేవుడితో పెట్టుకుంటే మట్టికరుస్తారు. ఈ ఘటనతో ముడిపడిన ప్రతి ఒక్కరినీ దోషులుగా నిలబెడతాం.

# హిందూమతంపై పకడ్బందీ కుట్ర!

**కల్తీ నెయ్యి.. కమీషన్ల కక్కుర్తితో చేసింది కాదు: చంద్రబాబు**
**తిరుమల పవిత్రతను దెబ్బతీయడమే ఉద్దేశం**
**జగన్ హయాంలో 219 గుళ్లపై దాడులు**
**మొత్తం 10 ఆలయాల్లో నెయ్యి కల్తీ**
**భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు**
**నాటి టీటీడీ చైర్మన్, కొనుగోలు కమిటీకి కల్తీ నెయ్యి గురించి తెలుసు**
**దోషులను కఠినంగా శిక్షించడానికి అన్ని చర్యలూ తీసుకుంటాం**
**సిట్ సూచనలపై ఏకసభ్య కమిటీ: సీఎం**



క్రైం కౌంటర్ న్యూస్,అమరావతి, ఫిబ్రవరి 5 తిరుమలేశుడి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసింది చాలక.. ఈ విషయంలో సీబీఐ సిట్ తమకు క్లీన్ చిట్ ఇచ్చిందంటూ మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడంపై కూటమిభాగస్వాములైన టీడీపీ, జనసేన, బీజేపీ అగ్ర నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హిందూమతంపై పకడ్బందీ ప్రణాళిక ప్రకారమే జగన్ అండ్ కో కుట్ర చేశారని సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధ్వజమెత్తారు. భగవంతుడిపైనే పగబట్టారని విమర్శించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో సీబీఐ సిట్ రాష్ట్రప్రభుత్వానికి చేసిన సూచనలపై తదుపరి చర్యలకు ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం ఉండవల్లి సీఎం నివాసంలో సీఎం, ఉపముఖ్యమంత్రి, మాధవ్, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్, ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలక సమావేశం నిర్వహించారు. అనంతరం వారంతా విలేకరులతో మాట్లాడుతూ జగన్ అండ్ కో తీరును ఎండగట్టారు.

219 ఆలయాలపై దాడులు..

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం.. కమీషన్ల కక్కుర్తి కోసం చేసింది కాదని చంద్రబాబు స్పష్టంచేశారు. ఇది పథకం ప్రకారం.. ఉద్దేశపూర్వకంగా తిరుమల పవిత్రతను.. ప్రాభవాన్ని దెబ్బతీసే కుట్రగా పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఘటనలను పరిశీలిస్తే వారి అసలు ఉద్దేశం అర్థమవుతుందన్నారు. ఆ ఐదేళ్లలో 219 ఆలయాలపై దాడులు చేసి,అపవిత్రం చేశారని.. వీటన్నింటినీ పరిశీలిస్తే.. పకడ్బందీగా, పక్కా ప్రణాళిక ప్రకారం హిందూ ఆలయాలపైన.. హిందూ మతంపైన దాడి చేస్తూ వచ్చారని స్పష్టమవుతోందని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. ముస్లింలకు మక్కా, క్రిస్టియన్లకు జెరూసలేం ఎంత పవిత్రమైనవో హిందువులకు తిరుమల అంత పవిత్రమైనదన్నారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం అనేది కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయం. ఈ లడ్డూ ప్రసాదం ప్రత్యేకమైనది, దానిని ఇతరులెవరూ తయారుచేయలేరు. అంతటి పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి కోట్ల మంది ప్రజలకు ప్రసాదంగా ఇచ్చి గత పాలకులు మహా పాపం చేశారు. ఆ ఐదేళ్లలో లడ్డూ ప్రసాదం తినాలంటేనే భక్తులు భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. ఇది వేంకటేశ్వరస్వామి పవిత్రతను దెబ్బతీయడానికి కావాలనే చేసిన పనిగా మేం భావిస్తున్నాం' అని తెలిపారు. స్వామి తమ కులదైవమన్నారు. 2003లో టీటీడీలో పవిత్రమైన 'ప్రాణదానం' కార్యక్రమాన్ని ప్రారంభించి తిరుమలకు వెళ్తుంటే తనపై 23 క్లైమోర్ మైన్స్‌తో హత్యాయత్నం జరిగితే.. సాక్షాత్తూ స్వామే పునర్జన్మ ఇచ్చాడని గుర్తుచేసుకున్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

హైందవ ధర్మంపై జగన్‌కు విశ్వాసం లేదు..

వైసీపీ పాలనలో హిందూ ఆలయాల విషయంలో ఎన్నో అపచారాలు చోటుచేసుకున్నాయి. రామతీర్థంలో రాముడి తల తొలగించారు. చూడడానికి వెళ్తే నాపై కేసులు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబెట్టి కందిరీగలు కారణమన్నారు. తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారం 2022లోనే వెలుగు చూసినా తొక్కిపెటారు. లడ్డూల్లో నాణ్యత తగ్గిపోవడంపై ప్రతిపక్షంగా ఎంతో పోరాడాం. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే లడ్డూకు వాడిన నెయ్యిని ఎన్‌డీడీబీకి పంపితే.. చాలా స్పష్టంగా కల్తీ జరిగిందని చెప్పింది. దానిపై నేను మాట్లాడితే నన్ను తప్పుబట్టారు. భగవంతుడంటే లెక్కలేనితనంగా వ్యవహరించారు. హైందవ ధర్మంపై జగన్‌కు విశ్వాసం లేకపోయినంత మాత్రాన ఇలా చేస్తారా? చరిత్రలో వేంకటేశ్వర స్వామితో ఎవరూ ఆటలాడుకోలేదు. బ్రిటిషర్లు కూడా తిరుమల సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించారు.. మెరుగుపరిచారు. వాళ్ల కంటే హీనంగా గత పాలకులు వ్యవహరించారు. తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఈ తరహా విషయాలను ముక్తకంఠంతో ఖండించాలి. మరోసారి ఎవరైనా ఇలాంటి మహాపచారం చేయాలంటే భయపడాలి. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని వదిలిపెట్టం. దోషులను కఠినంగా శిక్షించడానికి అన్ని చర్యలూ తీసుకుంటాం.

2022 నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు?

లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిందే కాకుండా మళ్లీ ఎదురుదాడి చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. 2022లో వచ్చిన నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు? అప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదు? గతంలో పనిచేసిన చైర్మన్ పీఏకు రూ.4 కోట్ల పైచిలుకు లంచంగా ఇచ్చారు. అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్‌కు, కొనుగోలు కమిటీకి తెలిసే కల్తీ నెయ్యి సరఫరా నిర్ణయాలు జరిగాయి. ఇప్పుడు వాళ్లే ఎదురుదాడి చేస్తున్నారు. దౌర్జన్యం, రౌడీయిజం చేయాలనుకుంటే మీ ఆటలు సాగవు. నాడు వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసి మళ్లీ నాపై ఆరోపణలు చేశారు. ఇప్పుడు శ్రీవారి ప్రసాదం కల్తీ చేసి తిరిగి నాపై ఆరోపణలు చేస్తున్నారు. భక్తుల విశ్వాసంపైనా, నమ్మకంపైనా దాడి చేస్తున్నారు. వైసీపీ హయాంలో తిరుమలతోపాటు పది ఆలయాల్లో నెయ్యి కల్తీకి పాల్పడ్డారు. దేవుడికి అపచారం జరిగినప్పుడు అందరూ ముక్తకంఠంతో ఖండించాలి. నెయ్యి కల్తీ చేసేందుకు ఎన్నో రకాల రసాయనాలు వాడినా భక్తుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లలేదంటే అది దేవుడి మహిమే.

రెండు కొండలు చాలన్నారు..

'మానవ సేవే.. మాధవ సేవ' అంటాం. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే భగవంతుడి ప్రసాదాన్నే కల్తీ చేశారు. ఏడుకొండలవాడికి రెండు కొండలు చాలు అన్న వ్యక్తులు భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. స్వామి నిస్సహాయుడని అనుకుంటున్నారా? క్షమించరాని మహాపాపం చేశారు. ఈ మహాపాపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. జగన్ కరుడుగట్టిన నేరస్థుడు.. అసత్యాన్ని సత్యమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. మహాపచారాన్ని సరిచేసేందుకు దేవుడు మమ్మల్ని ఎంచుకున్నాడు.. దీనిని దైవ కార్యక్రమంగా భావిస్తున్నాను.

డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం చేయలేదు?

జగన్‌కు వేంకటేశ్వరస్వామిపై భక్తి ఉంటే డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం పెట్టలేదు? టీటీడీ నిబంధనల ప్రకారం అన్యమతస్తులు డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సిందే. సంతకమే చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించిన వ్యక్తులు.. నాపై నిందారోపణలు చేస్తున్నారు.

కల్తీ జరగలేదని దేవుడు వచ్చి చెప్పాడా?నెయ్యిలో కల్తీ జరగలేదని సీబీఐ సిట్ క్లీన్ చిట్ ఇచ్చిందని నివేదికలో ఎక్కడుంది?వైసీపీ వాళ్లు ఏమైనా కల గన్నారా? వాళ్లకు దేవుడు వచ్చి చెప్పాడా? ఉద్దేశపూర్వకంగానేస్వామిని అపవిత్రం చేయడానికి కుట్రలు చేస్తున్నారు. ప్రభుత్వానికి సిట్ చేసిన సూచనలపై తదుపరి చర్యలు తీసుకునేందుకు ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేస్తాం. కల్తీ నెయ్యి వ్యవహారంపై పీఠాధిపతులతోనూ చర్చించి ముందుకెళ్తాం.

# ఏపీలో గర్భిణీలకు ఇక నుంచి ఉచితంగానే పంపిణీ

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 05 : ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో గర్భిణీలు, బాలింతలకు కూడా కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పలు సంక్షేమ పథకాలు అందిస్తోంది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలని.. పుట్టిన బిడ్డ క్షేమం కోసం.. గర్భం దాల్చినప్పటి నుంచి గర్భిణీలకు కావాల్సిన అన్ని రకాల అవసరాలను తీర్చుతోంది. అయితే సాధారణంగా గర్భం దాల్చిన తర్వాత మహిళలకు వచ్చే అనేక రకాల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి వాటిని నివారించే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా రక్తహీనతతో బాధపడే గర్భిణీలకు కూటమి సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్ (ఎఫ్‌సీఎం) ఇంజెక్షన్‌ను ఫ్రీగా అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ తాజాగా స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఈ ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్ ఇంజెక్షన్‌ను కేవలం బాలింతలకు మాత్రమే అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే దాన్ని గర్భిణీలకు కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

గర్భిణీలకు రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయి 10 గ్రాముల కంటే తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ఈ ఇంజెక్షన్ అందించనున్నట్లు ఏపీ ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఒకటి లేదా రెండు ఇంజెక్షన్లతోనే గర్భిణీల రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలు పెరిగి వారికి ఉన్న రక్తహీనత సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అదే సమయంలో అవసరమైన గర్భిణీలకు ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పించనుంది. గతంలో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను మళ్లీ అందుబాటులో తీసుకువచ్చినట్లు వెల్లడించింది.

మరోవైపు.. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాలింతల కోసం 53,500 ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ ఇంజెక్షన్లను ఇప్పటికే ఆయా జిల్లాలకు కూడా పంపించింది. ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి 80.. ఏరియా ఆస్పత్రులకు 175.. జిల్లా ఆసుపత్రులకు 400 చొప్పున ఈ ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లను సరఫరా చేసింది.

# తృటిలో తప్పిన ముప్పు కందకంలోకి దూసుకెళ్లిన ప్రైవేటు స్కూల్ బస్సు



క్రైం కౌంటర్ న్యూస్, చాట్రాయి, ఫిబ్రవరి 5 చాట్రాయి మండలం టి.గుడిపాడు గ్రామం వద్ద గురువారం ఉదయం ప్రైవేటు స్కూల్ బస్సు రోడ్డు పక్క కందకంలోకి దూసుకెళ్లి, ఓ పక్కకు ఒరిగిన ఘటనలో 8 మంది వి ద్యార్థులకు స్వల్ప గాయాలయ్యా యి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు ఉండగా, డ్రైవర్ బస్సు వదిలి పారిపోయాడు. వెంటనే చుట్టు పక్కల పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు వచ్చి బస్సు అద్దాలు బద్దలు కొట్టి విద్యార్థులను బయటకు తీసి కాపాడారు. రోడ్డు పక్కన ఉన్న తాటి మొద్దులు అడ్డుపడి బస్సును బోల్తా పడకుండా ఆపడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాద సమాచారం తెలిసి ఆందోళనతో బస్సు వద్దకు పరుగు పరుగున వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గ్రామస్థులు విద్యార్థులు స్వల్ప గా యాలతో బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. గాయపడిన విద్యార్థులను విస్సన్నపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. నలుగురు విద్యార్థులు నొప్పులతో బాధపడుతుండటంతో వైద్య పరీక్షల కోసం స్కూల్ యాజమాన్యం విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట సిద్ధార్థ స్కూల్ బస్సు ప్రతి రోజు ఉదయం మండలంలోని పోలవరం నుంచి మర్లపాలెం, టి.గుడిపాడు, తుమ్మగూడెం, చిత్తపూరు, కొండపర్వ మీదుగా విద్యార్థులను తీసుకెళ్తోంది. రోజు వచ్చే డ్రైవర్ సెలవు పెట్టడంతో స్కూల్ యాజమాన్యం మరో డ్రైవర్‌ను పంపారు. బస్సు టి.గుడిపాడు దాటిన తరువాత ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్ళి ప్రమాదానికి గురైంది. ఎస్సై డి.రామకృష్ణ, వీఆర్వో వినోద్, రవాణాశాఖ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేరించారు. ప్రమాదానికి గురైన స్కూల్ బస్సును ఎక్స్‌కవేటర్‌తో బయటకు తీసి చాట్రాయి పోలీస్టేషన్‌కు తరలించారు. బస్సు ప్రమాదాల నివారణకు నిబంధనలు : ఎంపీ తరచూ జరుగుతున్న బస్సు ప్రమాదాలపై ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విష యమై పార్లమెంట్‌లో మహేశ్ కుమార్ ప్రశ్నించారు. కేంద్ర మంత్రి నితిన్ గట్కరీ సమాధానమిస్తూ బస్సు ప్రమాదాల నివారణకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు.మోటారు వాహనాల నిబంధనల ప్రకారం బస్సుల్లో నిర్థిష్ట ప్రమాణాలు కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ వాహ నానికి పిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలన్నారు అనంతరం రెండేళ్లకు ఒకసారి ఫిట్‌నెట్ పరీక్షలు తప్పనిసరన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ఎక్సిట్, ఎమర్జెన్సీ డోర్లు ఉండాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల భద్రతకు ఏర్పాట్లు ఉండాలన్నారు.తృటిలో తప్పిన ముప్పుచాట్రాయి మండలం టి.గుడిపాడు గ్రామం వద్ద గురువారం ఉదయం ప్రైవేటు స్కూల్ బస్సు రోడ్డు పక్క కందకంలోకి దూసుకెళ్లి, ఓ పక్కకు ఒరిగిన ఘటనలో 8 మంది వి ద్యార్థులకు స్వల్ప గాయాలయ్యా యి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు ఉండగా, డ్రైవర్ బస్సు వదిలి పారిపోయాడు. వెంటనే చుట్టు పక్కల పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు వచ్చి బస్సు అద్దాలు బద్దలు కొట్టి విద్యార్థులను బయటకు తీసి కాపాడారు. రోడ్డు పక్కన ఉన్న తాటి మొద్దులు అడ్డుపడి బస్సును బోల్తా పడకుండా ఆపడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాద సమాచారం తెలిసి ఆందోళనతో బస్సు వద్దకు పరుగు పరుగున వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గ్రామస్థులు విద్యార్థులు స్వల్ప గా యాలతో బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. గాయపడిన విద్యార్థులను విస్సన్నపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. నలుగురు విద్యార్థులు నొప్పులతో బాధపడుతుండటంతో వైద్య పరీక్షల కోసం స్కూల్ యాజమాన్యం విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట సిద్ధార్థ స్కూల్ బస్సు ప్రతి రోజు ఉదయం మండలంలోని పోలవరం నుంచి మర్లపాలెం, టి.గుడిపాడు, తుమ్మగూడెం, చిత్తపూరు, కొండపర్వ మీదుగా విద్యార్థులను తీసుకెళ్తోంది. రోజు వచ్చే డ్రైవర్ సెలవు పెట్టడంతో స్కూల్ యాజమాన్యం మరో డ్రైవర్‌ను పంపారు. బస్సు టి.గుడిపాడు దాటిన తరువాత ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్ళి ప్రమాదానికి గురైంది. ఎస్సై డి.రామకృష్ణ, వీఆర్వో వినోద్, రవాణాశాఖ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేరించారు. ప్రమాదానికి గురైన స్కూల్ బస్సును ఎక్స్‌కవేటర్‌తో బయటకు తీసి చాట్రాయి పోలీస్టేషన్‌కు తరలించారు.

# సినిమా



## కృష్ణ గారు లేకపోతే ఇండస్ట్రీలో అదే ఆఖరి రోజు..

సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ తన సినీ ప్రస్థానాన్ని, ముఖ్యంగా సూపర్ స్టార్ కృష్ణ, శివాజీ గణేశన్‌లతో తనకు గల అనుబంధాన్ని పరుచూరి పలుకులు కార్యక్రమంలో గతంలో వివరించారు. 1981 అక్టోబర్‌లో అధ్యాపక ఉద్యోగాన్ని విడిచిపెట్టి సినిమా అవకాశాల కోసం మద్రాసు బయలుదేరిన రోజుల నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అప్పట్లో నెలకు కేవలం పదుకొండు వందల రూపాయల జీతం పొందే గోపాలకృష్ణకు, మద్రాసు వెళ్లే నిర్ణయం ఒక సవాలుగా మారింది. తన భార్య, ముగ్గురు పిల్లల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తూ, మద్రాసులో అవకాశం రాకపోతే కుటుంబం ఎలా బ్రతకాలనే ప్రశ్న ఆయన మదిని తొలిచివేస్తున్న సమయం అది. దీనికి సమాధానంగా, అక్టోబరు 21న సెలవు తీసుకున్న పరుచూరి, నవంబర్ 1న బయలుదేరి, నవంబర్ 30లోగా నెల ఖర్చులకు పోగా, పదుకొండు వందల రూపాయలు సంపాదించి తెస్తానని, లేకపోతే తిరిగి వచ్చి ఉద్యోగంలో కొనసాగుతానని సవాలు చేశారు. మద్రాసు వెళ్ళేటప్పుడు రైల్వే స్టేషన్‌లో వెయిట్ మిషన్ నుంచి వచ్చిన ఒక కార్డు, "నీది ఒక విచిత్రమైన జీవితం. ఒక ద్వారం మూసుకుంటే ఇంకో ద్వారం నీకు తెరుచుకుంటుంది" అని చెప్పింది. ఇది ఆయనకు విశ్వాసాన్ని కలిగించింది. మద్రాసులో మొదట రాఘవేంద్రరావు గారికి కథ చెప్పినా.. ఆయనకు నచ్చలేదు. అలా రోజులు గడిచిపోతుండగా, పద్నాలుగో రోజున అడవి సింహాలు చిత్ర దర్శకుడు అడిశిమిల్లి శేషారావు పరుచూరిని పిలిచి ఒక పరీక్ష పెట్టారు. నివురుగప్పిన నిప్పు చిత్ర క్లైమాక్స్ రాయమని కోరారు. అప్పటివరకు రాసిన వెర్షన్స్.. కృష్ణకు నచ్చినా శివాజీ గణేశన్‌కు నచ్చట్లా.. శివాజీకి నచ్చితో.. కృష్ణ గారికి నచ్చుడం లేదని వివరించారు.శేషారావు సూచన మేరకు పరుచూరి గోపాలకృష్ణ 14-16 పేజీల క్లైమాక్స్‌ను రాశారు. దర్శకత్వ శాఖలో పనిచేసే కే. మురళీ మోహన్‌రావు ఆ క్లైమాక్స్‌ను మెచ్చుకున్నారు. ఆ తర్వాత కో డైరెక్టర్ బాపయ్య కూడా ఆ క్లైమాక్స్ వెర్షన్‌కు ముగ్ధుడయ్యారు. అనంతరం శివాజీ గణేశన్ వద్దకు తీసుకెళ్లగా, ఆయన కళ్లు మూసుకుని విన్నారు. చదవడం పూర్తవగానే, "నువ్వు ఎన్టీ రామారావు ఫ్యాన్‌వా?" అని ప్రశ్నించి, రామారావు గారు పలికినట్లే డైలాగ్స్ పలుకుతున్నాడు అని మెచ్చుకున్నారు. శివాజీ గణేశన్ కూడా ఓకే చెప్పడంతో, సూపర్ స్టార్ కృష్ణకు వినిపించారు. కృష్ణ కూడా క్లైమాక్స్‌ను అంగీకరించారు. ఈ నిర్ణయం పరుచూరి గోపాలకృష్ణ సినీ జీవితానికి ఒక పునాదిగా నిలిచింది. ఈ విజయం తర్వాత, అడిశిమిల్లి శేషారావు ఆయనకు ఎంత కావాలని అడగగా, పరుచూరి కృతజ్ఞతతో డబ్బు వద్దన్నారు.

ఆ తర్వాత అగ్నిజ్వాల సినిమా స్క్రిప్ట్ రాసే అవకాశం వచ్చింది. ఆ సినిమాకు గోపాలకృష్ణ పదిహేను వేల రూపాయలు డిమాండ్ చేయగా.. ఐదు వేల రూపాయల అడ్వాన్స్ అందుకున్నారు. అదే రాత్రి, పి.సి.రెడ్డి బంగారు భూమి చిత్రంలోని పదుకొండు సీన్లు రాసే అవకాశం వచ్చి, మరో వెయ్యి నూటపదహారు రూపాయలు సంపాదించారు. మహారథి గారి అబ్బాయి చిట్టి ద్వారా మరో సినిమాకు ఐదు వేల రూపాయల అడ్వాన్స్ కూడా వచ్చింది. కేవలం ఏడు రోజుల్లోనే, గోపాలకృష్ణ పదుకొండు వేల రూపాయలకు పైగా సంపాదించి, నవంబర్ 30వ తేదీ రాత్రి ఇంటికి తిరిగి వెళ్లారు. పదుకొండు వందల రూపాయలు సంపాదించి రమ్మన్న తన భార్యకు, పది నెలల జీతానికి సమానమైన డబ్బుతో తిరిగి వచ్చి తన సవాలులో గెలిచానని నిరూపించారు.





## షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ తింటే ఏమవుతుంది?

ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వచ్చే సందేహం.. స్వీట్ కార్న్ తినవచ్చా? నిజానికి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టపడే ఈ స్నాక్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఇది తింటే షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా..? అనే ప్రశ్న చాలా మందిని వేధిస్తుంటుంది. స్వీట్ కార్న్‌లోని పోషక విలువలు, అది డయాబెటిస్‌పై చూపే ప్రభావాల గురించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

డయాబెటిస్‌పై స్వీట్ కార్న్ ప్రభావం

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : స్వీట్ కార్న్  స్కోరు 52-55 మధ్య ఉంటుంది. ఇది తక్కువ నుండి మితమైన కేటగిరీ కిందకు వస్తుంది. అంటే ఇతర పిండి పదార్థాల ఆహారాలతో పోలిస్తే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచదు.

డైటరీ ఫైబర్: ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. ఫలితంగా చక్కెర శోషణ నిదానంగా జరిగి ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా ఉంటాయి.అద్భుతమైన యాంటీఆక్సిడెంట్స్: ఇందులో ఉండే లుటీన్, జియాక్సంతిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి.ముఖ్యమైన పోషకాలు: విటమిన్  లతో పాటు మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీకి తోడ్పడతాయి.

ప్రతికూల అంశాలుఅధిక కార్బోహైడ్రేట్లు: స్వీట్ కార్న్‌లో పిండి పదార్థాలు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మోతాదు మించితే రక్తంలో చక్కెర పెరగడం ఖాయం. ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు: డబ్బాలో నిల్వ చేసిన లేదా స్వీటెనర్లు కలిపిన స్వీట్ కార్న్ ఉత్పత్తులు మధుమేహులకు అత్యంత ప్రమాదకరం. వీటిలో సోడియం, షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది.



## ఉదయాన్నే ఒక్క గ్లాసు తాగండి చాలు..

మన వంటింట్లో ప్రతిరోజు వాడే దినుసులలో మెంతులు ఒకటి.. కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, మెంతులు అద్భుతమైన ఔషధ గుణాలతో నిండి ఉన్నాయని చాలామందికి తెలియదు. ఆరోగ్యానికి, ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. నిత్యం వీటిని సరైన పద్ధతిలో తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే.. ఉదయాన్నే పరగడుపున మెంతుల నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు. మెంతుల నీరు.. ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, ప్రోటీన్, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలతో కూడిన శక్తివంతమైన పానీయం. రాత్రి నానబెట్టిన మెంతుల నీటిని ఉదయం పరగడుపున తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది.. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.. బరువు తగ్గదలకు సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు.

మెంతులు, మెంతుల నీటి వల్ల కలిగే లాభాలు..

మెంతులు, మెంతుల నీరు బాలింతలలో తల్లిపాలు పెంచడానికి ఎంతగానో సహాయపడతాయి. మెంతికూరను ఆహారంలో చేర్చడం లేదా మెంతులతో చేసిన దోసెలు, ఇడ్లీలు తీసుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుంది.

గర్భధారణ సమయంలో, ప్రసవాన్ని సులభతరం చేయడానికి, గర్భాశయ సంబంధ సమస్యలను తగ్గించడానికి మెంతులు ఉపయోగపడతాయి. ప్రసవం తర్వాత పేగుల కదలికను మెరుగుపరచి, నడుము నొప్పి వంటి సమస్యలను నివారిస్తాయి.

అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు రోజుకు 10-20 గ్రాముల మెంతులను నీటిలో లేదా మజ్జిగలో కలిపి తీసుకుంటే కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.

మధుమేహం నియంత్రణకు మెంతులు, మెంతుల నీరు అద్భుత ఔషధం. ప్రతిరోజూ ఒక టీస్పూన్ మెంతి పొడిని మూడు సార్లు తీసుకోవడం లేదా నానబెట్టిన మెంతులను నీటితో పాటు సేవించడం వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది.

మలబద్ధకం సమస్య ఉన్నవారు 2-3 చెంచాల నానబెట్టిన మెంతులను తింటే విరేచనం సాఫీగా అవుతుంది.

జ్వరం, గొంతునొప్పి తగ్గించడానికి మెంతులు, తేనె, నిమ్మరసం కలిపిన కషాయం ఉపశమనం ఇస్తుంది.

మెంతులను ఇలా తీసుకోండి..

ఈ విధంగా మెంతులు మనకు తెలియని ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాటిని సరైన రీతిలో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా అనేక సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. ఆరోగ్యకరమైన జీవనం కోసం మెంతులను మీ దినచర్యలో చేర్చుకోవాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.. ముందుగా రాత్రి పూట మెంతులను నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడంతోపాటు.. తినవచ్చు.. లేదా మెంతుల పొడిని నీటిలో మరిగించి తీసుకోవచ్చు.. లేకపోతే.. మెంతికూరను మీ ఆహారంలో జోడించుకోండి.. అయితే.. ఏమైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే వీటిని ఉపయోగించే ముందు ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

## వడోదరలో ఆర్‌సీబీ విశ్వరూపం.

వడోదర వేదికగా జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్ మ్యాచ్ అభిమానులకు అసలైన మజాను అందించింది. భారీ స్కోర్లు నమోదైన ఈ ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సంచలన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా అవతరించింది. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 204 పరుగుల భారీ లక్ష్యాన్ని మంధాన సేన ఇంకా 3 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి చరిత్ర సృష్టించింది. ఆఖరి నిమిషం వరకు విజయం ఇరుపక్షాల మధ్య దోబూచులాడినా, బెంగళూరు బ్యాటర్ల ధైర్యం ముందు ఢిల్లీ బౌలర్లు తలవంచక తప్పలేదు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. ఓపెనర్లు లిజెల్ లీ (37), షెఫాలీ వర్మ (20) మంచి ఆరంభాన్ని ఇవ్వగా, కెప్టెన్ జెమిమా రోడ్రిగ్స్ (57) కప్టెన్సీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. ఆమెకు తోడుగా లారా వోల్వార్డ్ (44), చివర్లో చినెల్ హెన్రీ (15 బంతుల్లో 35లి) మెరుపులు మెరిపించడంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 203/4 పరుగుల భారీ స్కోరు సాధించింది. డబ్ల్యూపీఎల్ ఫైనల్ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీకి తొమ్మిది పరుగులకే గ్రేస్ హారిస్ వికెట్ కోల్పోయి ఎదురుదెబ్బ తగిలింది. అయితే, కెప్టెన్ స్మృతి మంధాన (87), జార్జియా వోల్ (79) మైదానంలో పూనకం వచ్చినట్లు ఆడారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 165 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించారు. ముఖ్యంగా మంధాన కేవలం 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది, డబ్ల్యూపీఎల్ ఫైనల్స్ చరిత్రలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును తన పేరిట లిఖించుకుంది.

విజయం దిశగా సాగుతున్న ఆర్‌సీబీకి చివరి ఓవర్లలో ఢిల్లీ బౌలర్లు షాక్ ఇచ్చారు. జార్జియా వోల్, రిచా ఘోష్, చివరలో కెప్టెన్ మంధాన 19వ ఓవర్లో అవుట్ కావడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. ఆఖరి ఓవర్లో బెంగళూరు గెలుపుకు 10 పరుగులు అవసరమైన దశలో, ఢిల్లీ బౌలర్లు ఒత్తిడి పెంచారు. అయితే ఆర్‌సీబీ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు సంయమనంతో ఆడి ఇంకా 3 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించారు. దీంతో వరుసగా రెండో ఏడాది ఆర్‌సీబీ ఛాంపియన్‌గా నిలవగా, ఢిల్లీకి మళ్ళీ రన్నరప్ నిరాశే మిగిలింది.



## వడోదరలో చెలరేగిన ఢిల్లీ బ్యాటర్లు..

వడోదరలోని బీసీఏ స్టేడియం వేదికగా జరుగుతున్న మహిళల ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణయం ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ ధాటికి తలకిందులైనట్లు కనిపిస్తోంది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 203 పరుగుల భారీ స్కోరు సాధించి, ఆర్‌సీబీ ముందు 204 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా లిజెల్ లీ (37) ఆరంభంలోనే సయాలి సత్ఘరే వేసిన ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. మరో ఓపెనర్ షెఫాలీ వర్మ (20) తక్కువ స్కోరుకే అవుట్ అయినప్పటికీ, కెప్టెన్ జెమిమా రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. జెమిమా కేవలం 32 బంతుల్లో 7 ఫోర్ల సాయంతో 50 పరుగులు పూర్తి చేసి తన క్లాస్ చూపించింది.

జెమిమా అవుట్ అయిన తర్వాత కూడా ఢిల్లీ పరుగుల వేగం తగ్గలేదు. లారా వోల్వార్డ్,షెనెల్లే హెన్రీ ఆర్‌సీబీ బౌలర్లను టార్గెట్ చేస్తూ భారీ షాట్లు ఆడారు. 18 ఓవర్లకే 164 పరుగులు చేసిన ఢిల్లీ, చివరి రెండు ఓవర్లలో మరింత దూకుడు ప్రదర్శించి స్కోరును 200 దాటించింది. లారా వూల్‌వార్ట్ 44 పరుగులు చేయగా, షెనెల్లే హెన్రీ 15 బంతుల్లో అజేయంగా 35 పరుగులు చేసింది. ఆర్‌సీబీ బౌలర్లలో లారెన్ బెల్ 4 ఓవర్లలో కేవలం 19 పరుగులే ఇచ్చి కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినప్పటికీ, మిగిలిన వారు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అరుంధతి రెడ్డి ఒక వికెట్ తీసినా 40 పరుగులు ఇచ్చింది.

వడోదరలోని కోటంబి స్టేడియం పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ 160 పరుగుల స్కోరును ఛేజ్ చేయడమే గగనంగా ఉన్న తరుణంలో, ఆర్‌సీబీ ముందు ఏకంగా 204 పరుగుల లక్ష్యం ఉంది. అంటే ప్రతి ఓవర్‌కు 10 పరుగులకు పైగా రేటుతో బ్యాటింగ్ చేయాలి. రెండో ఇన్నింగ్స్‌లో డ్యూ ప్రభావం ఉంటే బ్యాటింగ్‌కు కొంచెం వెసులుబాటు దొరికే అవకాశం ఉందని కెప్టెన్ స్మృతి మంధాన ఆశిస్తోంది. ఇప్పుడు అంతా స్మృతి మంధాన, గ్రేస్ హారిస్ చేతుల్లోనే ఉంది. ఆర్‌సీబీ వరుసగా రెండో టైటిల్ గెలవాలంటే పవర్‌ప్లేలో భారీగా పరుగులు రాబట్టాలి. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మరిజన్నే కాప్, స్నేహ రాణా, మిన్ను మణిలు ఆర్‌సీబీని అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఢిల్లీ వరుసగా మూడు సార్లు ఫైనల్లో ఓడిపోయింది, ఈసారి 203 పరుగుల భారీ స్కోరుతో తమ మొదటి టైటిల్‌ను ముద్దాడాలని పట్టుదలగా ఉంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com